క్లుప్తంగా

రాయితీ గొర్రెలు పంపిణీ

కుంటాల: మండల కేంద్రంలో బుధవారం 14 మంది లబ్ధిదారులకు రాయితీ గొర్రెల యూనిట్లను సర్పంచ్ సమతా వెంకటేశ్ అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ప్రకాశ్, వెంకటేశ్, సబ్బిడి గజేందర్, రమేశ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన నాంపల్లి మల్లేశ్ రెండేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పీఏ కృష్ణరాజు ఇటీవల ఆపరేషన్‌కు సాయం అందించారు. బుధవారం ఫిజియోథెరపీ నిమిత్తం మరో రూ.ఐదు వేలు పంపించగా బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాకేశ్, రాజన్న, రమేశ్, రవి, రాజేశ్ తదితరులు ఉన్నారు.

ఎన్‌ఆర్‌ఐ చేయూత



ప్రింటర్ అందిస్తున్న షేక్ బానుబీ

సోన్: మండలంలోని జాఫ్రపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన షేక్ బానుబీ–షేక్ అహ్మద్ దంపతుల కుమారుడు షేక్ అహ్మద్ రూ.25 వేలు విలువైన ప్రింటర్, స్కానర్, జిరాక్స్ మిషన్, బ్యాండ్ సెట్లను విరాళంగా అందించారు. బుధవారం వాటిని తన తల్లి షేక్ బానుబీ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు తొడిశెట్టి పరమేశ్వర్‌కు అందించారు. ఈ సందర్భంగా వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రస్మా ఆధ్వర్యంలో చేయూత

ఖానాపూర్: పట్టణంలో గణేశుడి నిమజ్జన శోభాయాత్రలో ఇటీవల గాయపడ్డ చిన్నారులకు ట్రస్మా(ప్రైవేట్ పాఠశాలల యూనియన్) ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. బుధవారం ట్రస్మా సభ్యులు బాధిత చిన్నారుల సహాయార్థం రూ.12వేలను హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు సురేశ్‌కు అందజేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనుల ప్రారంభోత్సవంలో నాయకులు

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలో పంచాయతీ భవనం, పాఠశాలలో మరుగుదొడ్లు, జీపీ భవనం ప్రహరీ నిర్మాణ పనులతోపాటు రెండు హైమాస్టు దీపాల ఏర్పాటు పనులను బుధవారం ఎంపీపీ మోహిద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగ్లావత్ రాజునాయక్, ఎంపీటీసీ జంగిలి శంకర్, వైస్‌ఎంపీపీ వాల్‌సింగ్, వెంకాగౌడ్, రామునాయక్, శంకర్ తదితరులు ఉన్నారు.

వాహనాలు తనిఖీ

కుంటాల: మండలంలోని అంబకంటి–కుంటాల రోడ్డు మార్గంలో బుధవారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సోలమాన్‌రాజ్

లోకేశ్వరం: నర్సరీల్లో 2023–24కు సంబంధించిన హరితహారం ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. ప్రతి గ్రామంలో విధిగా తడి, పొడి చెత్తను సేకరించి రోడ్లను శుభ్రం చేయాలని సూచించారు. కార్యదర్శులు గ్రామసభలకు హాజరు కావాలని కోరారు.

భైంసా అధ్యాపకుడికి డాక్టరేట్



సంతోష్‌కుమార్

భైంసాటౌన్: భైంసాలోని గోపాల్‌రావ్ పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం బోధిస్తున్న అధ్యాపకుడు కోసరి సంతోష్‌కుమార్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు దీపమాల పర్యవేక్షణలో 'తెలంగాణ అటవీ ప్రాంతాల్లో కీటకాలు, పురుగుల యొక్క వైవిధ్యం జీవావరణ శాస్త్రం' అనే అంశంపై లక్నోలోని గ్లోకల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈమేరకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సంతోష్‌కుమార్ స్వస్థలం నర్సాపూర్(జి) మండలం టెంబుర్ని గ్రామం. ఆయనను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు అభినందించారు.

నిద్రపోతున్న నిఘా నేత్రాలు

- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- గ్రామాల్లో అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- పెరుగుతున్న దొంగతనాలు, నేరాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మండల కేంద్రంలో పనిచేయని సీసీ కెమెరా

నర్సాపూర్(జి): ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని.. వీటి ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పడతాయని గ్రామాలు, పట్టణాల్లో పోలీసులు అవగాహన కల్పించారు. దీంతో వీడీసీ సభ్యులు, దాతలు, ముందుకొచ్చి ప్రధాన కూడళ్లు, గ్రామ ప్రవేశాల వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకున్నారు. సీసీ కెమెరాల నిఘా క్లియర్‌గా ఉంటే దొంగతనాలు జరిగినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు సత్వర న్యాయం అందే అవకాశం ఉంటుంది. కానీ వీటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో సీసీ కెమెరాలు మూలనపడ్డాయి. అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి.. వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి..

మండలంలో 13 పంచాయతీలుండగా.. రెండేళ్ల కిందట తొమ్మిది గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. మండల కేంద్రంలో 12, గొల్లమాడలో తొమ్మిది, చాక్‌పల్లిలో ఆరు, రాంపూర్‌లో ఏడు, తిమ్మాపూర్(జి)లో ఐదు, పెంబుర్నిలో నాలుగు, అర్లి(కె)లో ఆరు, బామిని(బి)లో ఆరు, కుస్లి గ్రామంలో ఏడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఒక్కటీ పనిచేయడం లేదు. ప్రారంభంలో వీటి పని తీరు బాగానే ఉన్నా.. పర్యవేక్షణ లేక పరిస్థితి మొదటికొచ్చింది. అంజనీతండా, బూర్గుపల్లి(జి), నందన్ గ్రామాల్లో మాత్రం సీసీ కెమెరాలు ఏర్పాటే చేయలేదు.

నిర్వహణను గాలి కొదిలేసిన వైనం..

నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలను నెలకోసారి పరిశీలించి.. మరమ్మతులుంటే చేయించాలి. కానీ అధికారుల పర్యవేక్షణ లేక ఇవి నిరుపయోగంగా మారాయి. జాతీయ రహదారి పక్కనే నర్సాపూర్(జి), రాంపూర్, నసీరాబాద్, చాక్‌పల్లి, తురాటి, అర్లి(కె) గ్రామాలు ఉండటంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. సీసీ కెమెరాల నిర్వహణ సక్రమంగా ఉంటే అందులో ప్రతిదీ రికార్డై ఉంటుంది. దీంతో నేరాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధ్యులను సకాలంలో గుర్తించవచ్చు.

సీసీ కెమెరాల్లేక నిందితులు దొరకని ఘటనలు

- 2021 అక్టోబర్‌లో నసీరాబాద్‌కు చెందిన మల్లెల సత్తెవ్వ ఇంటి వద్ద ఉండగా ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి రెండు తులాల బంగారు గొ లు సు ను ఎత్తుకెళ్లాడు. ఇప్పటికీ నిందితుడు దొరకలే దు.
- గతేడాది మండలంలోని గొల్లమాడలో మహాపోచమ్మ ఆలయం హుండీ పగులగొట్టి రూ.60 వేలు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు.
- మే 1న మండలంలోని తురాటి ఎక్స్‌రోడ్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న అబ్బన్‌వాడ్ సాయినాథ్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- మే 30న మండలంలోని చాక్‌పల్లి పంచాయతీలోని బూరుగుపల్లి(కె) గ్రామానికి చెందిన దుగ్గి భోజవ్వ అనే వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందింది.
- ఆగస్టులో చాక్‌పల్లి గ్రామానికి చెందిన గోండ్ర సంజయ్ టాటాఏస్ వాహనం, రాంపూర్ గ్రామానికి చెందిన చిన్నోల్ల నర్సయ్య ట్రాక్టర్ కల్టివేటర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు.

వినియోగంలోకి తేవాలి..



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఒక్కటీ పని చేయడం లేదు. వెంటనే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలి. ఏదైనా అనుకోని ఘటనలు జరిగినప్పుడు ఈ సీసీ కెమెరాలు సాక్ష్యాలుగా ఉపయోగపడతాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– కోడె సుధాకర్, నర్సాపూర్(జి)

ఒక్కటీ పనిచేయడం లేదు



గ్రామంలో వీడీసీ సహకారంతో 12 కెమెరాలను ఏర్పాటు చేసుకున్నాం. ప్రస్తుతం ఒక్కటీ పని చేయడం లేదు. గ్రామంలోకి వచ్చే అపరిచితుల వివరాలు తెలియడం లేదు.

– డి.శ్రీనివాస్, గొల్లమాడ

మరమ్మతులు చేయిస్తాం



సీసీ కెమెరాలతో కేసుల ఛేదన సులభమవుతుంది. ప్రస్తుతం మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గ్రామస్తుల సహకారంతో పనిచేయని కెమెరాలకు వెంటనే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొస్తాం.

– పి.రవీందర్, ఎస్సై, నర్సాపూర్(జి)

ఈరోజు

ఎమ్మెల్యే రాక

ముథోల్: మండల కేంద్రానికి గురువారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి రానున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని కోరారు.

తానూరు: మండలంలోని కోలూరు, జౌలా(బి), సింగన్‌గాం గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

క్రీడా సామగ్రి పంపిణీ

లోకేశ్వరం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం క్రీడా సామగ్రి అందజేస్తామని ఎంపీడీవో సోలమాన్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

భైంసారూరల్: భైంసా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బతుకమ్మ చీరలు, పంచాయతీలకు క్రీడా సామగ్రి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరవుతారని.. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవాలని కోరారు.

కుంటాల: మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో గురువారం ఉదయం 11 గంటలకు బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

నాయకుల ముందస్తు అరెస్టులు



లక్ష్మణచాంద: అరెస్టయిన బీజేపీ నాయకులు



ఖానాపూర్‌లో మధ్యాహ్న భోజన కార్మికులు..



కడెంలో కాంగ్రెస్ నాయకుల అరెస్టు

లక్ష్మణచాంద: జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటారనే నేపథ్యంలో మండలంలోని పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండలాధ్యక్షుడు పోలాస గోవర్ధన్, ఉపాధ్యక్షుడు గుడ్ల రంజిత్, సర్పంచ్ ముత్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు, మెంగు అనిల్, నాగుల రాజ్‌కుమార్, గంగాధర్, గోపి తదితరులు ఉన్నారు.

ముథోల్: ముథోల్‌లో పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ముథోల్ ఎంపీటీసీ దేవోజీ భూమేశ్, మండలాధ్యక్షుడు కోరి పోతన్న, బీజేపీ నాయకులు ఉమేశ్, తాటివార్ రమేశ్, యోగేశ్, సంగొల్ల పోతన్న, సపట్లోళ్ల పోతన్న, రాంకీ, సుదర్శన్‌తోపాటు తదితరులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కుంటాల: మంత్రి కేటీఆర్ సభకు వెళ్లకుండా మండలంలోని ఆశా, బీజేపీ కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై వదిలారు.

సోన్: మంత్రి పర్యటనను అడ్డుకుంటారనే సమాచారంతో బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రెడ్డి, మార గంగారెడ్డి, అశోక్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులతోపాటు మధ్యాహ్న భోజన కార్మికులను అరెస్టు చేసి పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో తోకల బుచ్చన్న, రమేశ్, గోపాల్‌రెడ్డి, ఎనగందుల రవి, సంద వేణు, పద్మ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

కడెం: మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండలంలోని ఆశవర్కర్లు, అంగన్‌వాడీలు, ప్రజాసంఘాలు, బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా ఆదుపులోకి తీసుకున్నామన్నారు.

భైంసాటౌన్: జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ సభ నేపథ్యంలో పలువురు బీజేపీ, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులను బుధవారం ఉదయం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పి.రమాదేవి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామారావుపటేల్, భోస్లే మోహన్‌రావుపటేల్‌ను హౌస్ అరెస్ట్ చేశారు.

కానిస్టేబుళ్లుగా ఎంపిక



ప్రవీణ్‌రెడ్డి



హరీశ్‌రెడ్డి



దీపక్



ముత్యం



గీత్‌కుమార్



మధు



ప్రఫుల్



లక్ష్మణ్



మల్లేశ్



నవీన్‌నాయక్

లక్ష్మణచాంద: మండలంలోని పలువురు యువకులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. బుధవారం రాత్రి ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో మండలంలోని మునిపెల్లికి చెందిన శేర్ రాజారెడ్డి–నర్సవ్వ దంపతుల కుమారుడు ప్రవీణ్‌రెడ్డి ఏఆర్ కానిస్టేబుల్‌గా.. మునిపెల్లికే చెందిన చిన్నారెడ్డి–పద్మ దంపతుల కుమారుడు హరీశ్‌రెడ్డి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. మండలంలోని కనకాపూర్‌కు చెందిన రమేశ్–ప్రేమల దంపతుల కుమారుడు దీపక్ ఏఆర్ కానిస్టేబుల్‌గా మల్లాపూర్‌కు చెందిన బోడ హన్మాండ్లు–లక్ష్మి దంపతుల కుమారుడు ముత్యం సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి ఉద్యోగాలు సాధించిన యువకులను అభినందించారు.

కుంటాల మండలం నుంచి ఐదుగురు..

కుంటాల: మండలంలో ఐదుగురు సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. మండలంలోని అంబుగామ గ్రామానికి చెందిన గీత్‌కుమార్, విఠాపూర్‌కు చెందిన సంధ్య, పెంచికల్‌పాడ్‌కు చెందిన మధు, కల్లూర్‌కు చెందిన ప్రఫుల్, దౌనెల్లికి చెందిన లక్ష్మణ్ ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన యువకులను బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

నర్సాపూర్(జి) నుంచి ఇద్దరు..

నర్సాపూర్(జి):మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన తేలు మల్లేశ్, అంజనీతండా గ్రామానికి చెందిన రాథోడ్ నవీన్‌నాయక్ సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. నవీన్‌నాయక్ ప్రస్తుతం టీఎస్‌ఎస్పీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వీరి ఎంపికపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వన్యప్రాణులను రక్షించాలి



పొన్కల్‌లో మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో అవినాష్

దస్తురాబాద్: వన్యప్రాణులను సంరక్షించాలని డీఆర్వో సిద్ధార్థ పేర్కొన్నారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం కవ్వాల్ అటవీ ప్రాంతంలోని బర్డ్‌వాచ్, ట్రెక్కింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామడ: అడవులను పెంచుతూ వన్యప్రాణులను సంరక్షించుకోవడంలో అందరూ భాగస్వాములు కావాలని దిమ్మదుర్తి అటవీక్షేత్ర అధికారి రాథోడ్ అవినాష్ అన్నారు. బుధవారం మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన్యప్రాణుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన అజయ్, రమ, శ్రావణ్, గంగాధర్‌కు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరవింద్‌కుమార్, డిప్యూటీ ఎఫ్ఆర్‌ఓ నజీర్‌ఖాన్, బీట్ అధికారులు నవీన్, నుమానుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల భిక్షాటన



కుభీర్‌లో భిక్షాటన చేస్తున్న ఆశవర్కర్లు

సోన్: మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటారనే సమాచారంతో మండలంలోని ఆశవర్కర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడుతున్నామని.. పోలీస్‌స్టేషన్‌లోనే భిక్షాటన చేశారు. కార్యక్రమంలో మండలంలోని ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దస్తురాబాద్: ప్రభుత్వం స్పందించడం లేదని మండల కేంద్రంలో ఆశవర్కర్లు భిక్షాటన చేశారు. ఆశవర్కర్లు సుజాత, గోదావరి, లక్ష్మి, అనసూర్య, పద్మ, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలో ఆశవర్కర్లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సమాన వేతనం అందించి తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆశవర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 10వ రోజుకు చేరింది. ఈసందర్భంగా వారు పట్టణంలోని వ్యాపారకూడళ్లతో పాటు సంత వద్ద భిక్షాటన చేసి వినూత్న నిరసన తెలిపారు. వేర్వేరుగా చేపట్టిన కార్యక్రమాల్లో స్వాతి, రజిత, కమల, మమత, పద్మ, సంధ్య, లక్ష్మి, ఎర్రవ్వ, సుజాత, లక్ష్మిబాయి, త్రివేణి, వేరోనిక తదితరులు ఉన్నారు.

కుభీర్: తమ సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో ఆశవర్కర్లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సులోచన, గిరిజ, లక్ష్మి, గంగామణి, మంగళ తదితరులు ఉన్నారు.

కేటీఆర్ సభకు తరలిన నాయకులు



లక్ష్మణచాంద: తిర్పెల్లి నుంచి వెళ్తున్న నాయకులు



సారంగాపూర్: కంకెట నుంచి వెళ్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు కేటీఆర్ సభకు బైక్‌లు, ఆటోల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మండలాధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్ణారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, మండల ఉపాధ్యక్షుడు జహీరొద్దీన్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మంత్రి కేటీఆర్ సభకు బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి ఆధ్వర్యంలో నేతలు తరలివెళ్లారు. జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, రైతుబంధు సమితి మండల కన్వీనర్ శంకర్‌గౌడ్, సర్పంచుల సంఘం మండల కన్వీనర్ ప్రదీప్‌కుమార్, సట్ల గజ్జారాం తదితరులు ఉన్నారు.

సారంగపూర్ నుంచి..

సారంగపూర్: జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి బుధవారం భారీ సంఖ్యలో ప్రజలు, బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మాధవరావు, కొట్ల(బి), నారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి, రాజ్‌మహ్మద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాంరెడ్డి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో బుధవారం మహిళలకు బతుకమ్మ చీరలను సర్పంచ్ రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేశ్, జాగృతి మండలాధ్యక్షుడు దొర రాజు, బర్కుంట గంగారాం, వార్డు సభ్యుడు కందగిరి మహేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన అభిమానం



జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన కేటీఆర్ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొందరు యువకులు గులాబీ రంగు పోసుకొని ఒంటికి బీఆర్‌ఎస్, కేటీఆర్, ఐకేఆర్ పేరుతో అక్షరాలు రాయించుకుని తమ అభిమానం చాటుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

బీజేపీ నేతల ప్రచారం



బోరిగాంలో మాట్లాడుతున్న మోహన్‌రావ్

భైంసారూరల్: మండలంలోని బోరిగాం, హంపోలి, హజ్గుల్ గ్రామాల్లో బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు పటేల్ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో ఇంటింటా తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని.. వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. అంతకుముందు పార్టీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. వారి వెంట పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

కుంటాల: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కనీస్ ఫాతిమా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఓలా అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో ఉన్నా.. లబ్ధిదారులు ఇబ్బంది లేకుండా ఆహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యదర్శి యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామంలో రూ.16లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు బుధవారం సర్పంచ్ దుప్పె గణేశ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోనేకర్ శంకర్, దిగంబర్‌పటేల్, రమేశ్, గోవింద్, సాయినాథ్ తదితరులు ఉన్నారు.